# తిండిదొంగ

సులోచన

'ఏమే, ఎన్ని రోజులని ఈ తిండి పెట్టేట్టు? వారికేం హాయిగా, జమీందారులాగ కూచోని తింటారు. మధ్య కర్చు భరించలేక చచ్చేది మనం.'

తల్లి ఆమాట అన్నందుకు నిజంగా కూతురికి కోపమో, కనీసం న్యూనతో వచ్చివుండివలసింది. కాని రాలేదు. తన భర్త 'వాజ' అని తెల్సుకున్నప్పటినుంచీ, అతన్ని గూర్చి తల్లి ఏమన్నా సహించి వూరుకోవడం ఆరంభించింది.

చిత్ర మేమంటే, అల్లుడిని ఆడిపోయడం కూతురుదగ్గరే గాని, అల్లుడిదగ్గర పల్లెత్తుమాట తీసిపోనీదు. ఎంతో ఆప్యాయంగా వుంటుంది. అల్లుడంటే తనకెంత ప్రేమో నిరూపిస్తుంది.

ఈ తెరచాటు నాటకం కూతురికి రుచించదు. అనాల్సిన మాటలేవో ముఖాన అనేసే నైజం. ఒకనాటి రాత్రి భర్తకు చెప్పింది విషయాన్ని సంక్షిప్తంచేసి.

ఉన్నది చెపితే ఉలుకెక్కు వన్నట్టు. మరునాడు అల్లుడుగారు ప్రయాణమై పోయారు. అలాగని వాళ్ళకేమీ విచారం కలక్కపోగా, ఓ రకంగా సంతోషించారు. నిజ మాలోచిస్తే, నిజ మాలోచించే అవసరం అల్లుడిగారికి లేకపోయిందనే చెప్పాలి. ఎంత అల్లుడైతేమటుకు, ఎంత ప్రేమగలిన అత్తైతేమాత్రం, అశ్రాంతం, మంచి అనువైన తిండి దొరుకుతోందిగదా, అని వుండటం ఎవ్వరికి గిట్టుతుంది? ఆ సంగతి గ్రహించలేకపోవటానికి అల్లుడుగారు నిరక్షరాస్యుడన్నా కావాలి. ఇంటర్ దాకా చదివి (రెండో సంవత్సరం పోయింది లెండి) ఆ పని చేస్తోన్నాడంటే, హర్షించే వాళ్ళెవరయినా వుంటారా, అనేది ఆయనకు లేకపోవటాన్ని గూర్చి విచారం అత్తగారికేకాకుండా, కూతురుకు గూడా వేయడంలో ఆశ్చర్యం లేదు.

పట్టుమని పదిరోజులు తిరక్కముందే మళ్లా వచ్చాడు. ఈదఫా వూరికే గాలేదు, అంటే ధనంతో వచ్చాడనీగాదు. ఆలోచించుకొనే వచ్చాడు. ఏమీ లేకపోయినా, అల్లుడిగారిలో 'టక్కరితనం' మూర్తీభవించి వుంది. ఇదివరకు ఆ టక్కరితనాన్ని వుపయోగించకపోవటాన్ని గూర్చి తలపోసినా, ఇక వుపయోగించడానికి ఆటంకం లేదు.

ఆరాత్రి భార్య, అత్త ఒక్కచోట వుండగా అన్నాడు—"మరి నాకు 'సబ్ ఇనస్పెక్టర్' వుద్యోగం వచ్చింది" అని.

ముఖ్యంగా అత్తగారికి ఎక్కడలేని ఆనందం పుట్టుకొచ్చింది. కాని 'వుద్యోగం వదులుకో, కూతురు లేనిదీ క్షణం వుండలేను' అని ఎలా చెప్పాలో ఆమెకు అర్థంకాక, ఆలోచించక, ఏదో అనేసింది. అల్లుడుగారు సంతుష్ట హృదయుండై వాడని వేరే చెప్ప నక్కర్లేదు. తన పంటపండింది.

అత్తగారు దివ్యంగా తిండి పెట్టటమే గాకుండా, అల్లుడిగారికి యిలాటి వుద్యోగం వచ్చినా, లక్ష్యపెట్టక వదులుకొన్నాడనీన్నీ, వదులుకోమని మేం చెప్పినమీదట గాని వదులుకో లేదనీన్నీ, అంతకీ ఒప్పుకోలేదనీన్నీ వూరు వూరంతా చాటింది.

భర్తగారికి ఈ వుద్యోగం లభించడం పూర్వ పుణ్య సుకృతమేనని అనుకుంది కూతురు. కాని ఇంతటి వుద్యోగం లభిస్తే వదులుకోమని అమ్మ చెప్పటంలో, అతను తడవుగా వదులుకోటంలో ఆమెకు అర్థంకాలేదు. అంతటి వుద్యోగంవస్తే ఎవడు వదులుకొంటాడు అనే వూహా పోయింది. అసలు విషయం ఏమిటంటే, భర్త వుద్యోగం చేస్తోంటే తను పెద్ద పెద్ద పట్టణాలూ, అవీ, ఇవీ చూడొచ్చని.

నాలుగునెల్లు దివ్యంగా గడిచాయి. ఎలా పెట్టినా మొదటిపెట్టిన తిండి క్షీణించటం మొదలెట్టింది. అత్తగారిలో మునుపటి అప్యాయత, ప్రేమ కనుపించటం మానేసిందని తెల్సుకొనేందుకు ఎక్కువరోజులు పట్టలేదు. అసలు ఆనందంతప్ప, తక్కిందంతా జరుగుతోందిగాని ఇలా ఎన్ని దినాలు గడపాలి?

మంచినీళ్లు తనే ముంచుకొని తాగాల్సి

చ్చింది. కాఫీయేగాని ఫలహారం చేయడం మానేశారు. ఇటువంటి పరిస్థితుల్లో, ఇంటర్ సెకండియర్ తప్పినప్పటినుంచీ ఏర్పడిన టక్కరితనాన్ని వినియోగించాల్సింది. మారు మాటాడకండా మరునాడు బండి ఎక్కాడు.

ఇప్పుడు అత్తగారికి ఏ మనిపిస్తోందంటే— అల్లుడుగార్ని వుద్యోగంలో ప్రవేశించవద్దనడం ఎంతైనా తప్పు. మళ్ళా ఆ సంగతి ఎత్తి కచ్చితంగా చేరమనే చెబుదామనుకొంది. కాని అల్లుడుగారు అలాంటి అవకాశం కల్పించ జేయక పోడం శోచనీయంగా తోచింది.

ఈదఫా పదిహేనురోజులుండి, ఓ రాత్రి వచ్చి,—'ఏదో ఒక వుద్యోగాన్ని ఒదులుకొన్నాను, ఈ వుద్యోగమన్నా చేయకపోతే లాభం లేదు. ఇంతవరకు చదివిన చదువంతా వ్యర్థమౌతోంది. తప్పకండా పిల్లని పంపించాల్సిందే, రేపే ప్రయాణం" అని గుక్క తిప్పుకోకండా వుపన్యాసం దంచేశాడు.

'ఉద్యోగం ఏమిటేది?" అని అత్తగారు ఆదుర్దాతో ప్రశ్నించింది. 'బొంబాయిలో సముద్రాలమీద పని' అన్నాడు.

అత్తగారికి ఒకవిధంగా ఆనందమే కాకుండా, భయంకూడ వేసి అంటిగదా, 'వద్దులే బాబూ, వుద్యోగం లేకపోతే, అసలు వుద్యోగం దేనికి హాయిగా కూచోని తినక' అని.

ఆమె ఆ మాటలు అంది నిజంగా భయం వేసే, సముద్రాలమీద ఏమి మొప్పం వస్తుందో, పుటిక్కని...?

ఈ దఫా అత్తగారికి అల్లుడిగారిమీద నిజంగా ప్రేమ పుట్టిందని చెప్పొచ్చు. కాని గట్టిగాచెప్ప లేము. నాలుగునెల్లు పోయాక మారితేమారొచ్చు.

మళ్ళీ ఆరునెల్లువరకూ దివ్యంగా తిండి దొరికింది. అల్లుడుగారి ఇంటర్మీడియట్ సంస్కృతి విజ్ఞానం ముఖ్యంగా దీనికి, ఈ కార్యానికి వినియోగిస్తున్నాడని లోకులు అనుకున్నా అతనికి లక్ష్యం లేదు.

అతన్ని ఒక్కమాటలో చెప్పాలంటే 'తిండి దొంగ' అని అనాల్సిందే.

# నూతన చైనాను గుర్తించాలి

పి. గోపాలకృష్ణ

గడచిన అక్టోబరు 1-వ తారీఖురోజున పీకింగ్‌లో క్రొత్త చైనా ప్రభుత్వం ఏర్పడినది. చైనాలోని అంతర్యుద్ధమింకా ముగియలేదు. మూడు వంతులకు పైగా కమ్యూనిస్టులకు వశమైనప్పటికీ చైనాలో యింకా కొంతభాగం నేషనలిస్టు ప్రభుత్వాధీనంలో నుంది. కాని కమ్యూనిస్టు ప్రభుత్వం చైనాఅంతా పూర్తిగా తన స్వాధీనములోకి రాకముందే ఎందుకు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి దాన్ని గుర్తించవలసినదిగా ప్రపంచ రాజ్యాలన్నిటినీ కోరినది? నేషనలిస్టు ప్రభుత్వపతనం తథ్యమని తెలియుటయే దీనికి కారణం. ఇదికాక చైనా ప్రజానీకంలో నేషనలిస్టు ప్రభుత్వంపై విశ్వాసం పూర్తిగా తొలిగిపోయినది. వారు సరియైన పద్ధతుల నవలంబించలేక, ఒకటి వెంబడి యొకటి తప్పటడుగులు వేయుచు, తుదకు తాము చైనాను పాలించుటకు పూర్తిగా పనికిరారని యింతవరకు మిత్ర రాజ్యములు, అపార ధనవస్తు సహాయము చేసిన అమెరికాచేత సహితము తూలనాడబడిరి. అటువంటి నేషనలిస్టు ప్రభుత్వం పరాజిత మవుతూందని, కొద్ది రోజులలో పూర్తిగా కూలిపోదుందనీ అంటే ఎవరికీ ఏమీ ఆశ్చర్యం లేదు. వారికి ప్రజలయొక్క సానుభూతి ఏమాత్రంలేదు (దీనికి తార్కాణం వారి సైన్యములు పటాలములవారిగా కమ్యూనిస్టుసైన్యంలో చేరిపోవుట.) ఇతర దేశముల సానుభూతి పూర్తిగా వదలినది. ఏకొద్దియైనను వున్న అది నిష్ప్రయోజనము. ఇటువంటి సందర్భంలో చాంగ్-కై-షేక్ అనూ నాయక ప్రభుత్వం తమ పట్టు వదలక యింకనూ యుద్ధము సాగించుచు, వేలాది సైనికులను తమ ఫిరంగులకు గురిచేయడం శోచనీయము.

మావో-సే-టుంగ్ అధ్యక్షతనుఏర్పడిన నూతన